క్లుప్తంగా

డాక్టర్ గోపిరెడ్డికి అభినందనల వెల్లువ



నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులుగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి నియోజకవర్గంలోని ప్రజల నుంచి అభినందలు వెలువెత్తుతున్నాయి. గురువారం నియోజకవర్గంలోని పలు గ్రామాలు, పట్టణంలోని పలు వార్డుల నుంచి అనేకమంది నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేయోభిలాషులు వందలాదిగా పార్టీ కార్యాలయంకు తరలివచ్చి ఆయనను దుశ్శాలువ కప్పి పూలదండలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. వారందరికీ డాక్టర్ గోపిరెడ్డి తన కృతజ్ఞతలు తెలియచేశారు.

బీఎల్‌వోలకు శిక్షణ తరగతులు ప్రారంభం

వినుకొండ: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వినుకొండ నియోజకవర్గం లోని బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల అధికారి కె.శ్రీరాములు, అధ్యక్షతన జరిగిన సమావేశంలో తహసీల్దార్ సురేష్ నాయక్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ఈనె 3వతేదీ నుంచి 17 వతేదీ వరకు బీఎల్వోలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తప్పనిసరిగా అందరూ తరగతులకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మూడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా బంద్

యడ్లపాడు: మండలంలోని పుట్టకోట, కొండవీడు, కోట గ్రామాలకు శుక్రవారం ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఈ విద్యుత్ కోత అనివార్యమని చిలకలూరిపేట ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ అశోక్ కుమార్ చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి

మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు



నకరికల్లు: అధీకృత డీలర్ల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. నకరికల్లులోని పలు విత్తన దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ పుస్తకాలు, రసీదులు పరిశీలించారు. విత్తన నిల్వలను పరిశీలించి మూడు రకాల విత్తన నమూనాలను నాణ్యత పరీక్షల కోసం తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా రసీదు పొందాలన్నారు. రసీదుపై అమ్మకందారుని, కొనుగోలుదారుని సంతకం ఉండాలన్నారు. నాణ్యతలేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు షేక్ సుభాని, డీలర్‌లు పాల్గొన్నారు.

టూ వీలర్ మెకానిక్‌లు ఐక్యతతో ఉండాలి



అచ్చంపేట: టూవీలర్ మెకానిక్‌లంతా ఐక్యతతో ఉండాలని, వాహనదారులకు మెరుగైన సేవలను అందిస్తూ జీవనోపాధి కొనసాగించాలని పల్నాడు జిల్లా మెకానిక్స్ యూనియన్ కార్యదర్శి బాబూ మేస్త్రి అన్నారు. ప్రపంచ మెకానిక్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆంజనేయస్వామి విగ్రహం వద్ద గురువారం యూనియన్ సభ్యులు కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా బాబూ మేస్త్రి మాట్లాడుతూ ఇప్పుడు ప్రతి ఇంటికి ఒకటి, రెండు ద్విచక్ర వాహనాలున్నాయన్నారు. వారందరికీ తమ ఆవశ్యకత ఉందన్నారు. మనమంతా ఐక్యతతో ఉండాలని వాహనదారులకు మెరుగైన సేవలందింస్తూ సమాజంలో గౌరవంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో సత్తెనపల్లి టౌన్ జాయింట్ సెక్రటరీ ఖాజావలి, అచ్చంపేట మండల యూనియన్ అధ్యక్షుడు నాగుల్‌మీరా, రఫీమేస్త్రి, కర్బర్‌మేస్త్రి, సుభాని మేస్త్రి, ఇమాంవలి తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘన సత్కారం



శావల్యాపురంలో శ్రీనివాసరాజును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



వినుకొండలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ప్రధానోపాధ్యాయులు

వినుకొండ: అంకితభావంతో పనిచేసి ఎంతోమంది భావిభారత పౌరులుగా తీర్చిదిద్దిన ప్రధానోపాధ్యాయని అపర్ణ అందరికీ ఆదర్శమని ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరాజు అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఐదేళ్లుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన అపర్ణతో పాటు ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులకు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పాఠశాల అభివృద్ధికి ఆమె చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని అభివృద్ధి చేస్తామని చెప్పారు. సన్మానం పొందిన వారిలో విజయకుమారి, ఉమా కుమారి, శ్రీలక్ష్మి, కౌసల్య, శ్రీనివాసారావు, తిరుపతిరావు లతోపాటు పలువురు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలో బదిలీ వెళ్లిన ఉపాధ్యాయులకు అభినందన సభ గురు వారం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోడ్డపాటి విజయలక్ష్మి మాట్లాడుతూ సాదారణ బదిలీపై ఉపాధ్యాయులు వెళ్ళిన పాఠశాల్లో నాణ్యమైన విద్యను అందించి మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. గణిత ఉపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాసరాజు పదోన్నతిపై జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా వెళ్లటం పనితీరుకు నిదర్శమన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవరు మృతి

- కనమర్లపూడి వద్ద లారీ– ట్రావెలర్స్ బస్సు ఢీ
- 10 మందికి బస్సు ప్రయాణికులకు గాయాలు



సంఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపడుతున్న ఎస్సై లోకేశ్వరరావు

శావల్యాపురం: ట్రావెల్స్ బస్సు డ్రైవరు అజాగ్రత్త వాహనం నడిపి ఎదురుగా వస్తున్న ఓ లారీ డ్రైవరు ప్రాణాలను తీసిన ఘటన గురువారం తెల్లవారుజామున మండల పరిధిలోని కనమర్లపూడి వద్ద చోటుచేసుకుంది. ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు కథనం ప్రకారం.. ఒరిస్సాలోని నవరంగపూర్ నుంచి ఈ నెల 2న టమాటాల లోడు తీసుకువచ్చేందుకు ఖాళీ బాక్సులు తీసుకొని అన్నమయ్య జిల్లా మదనపల్లికు ట్రక్కులారీ బయలుదేరింది. ఈక్రమంలో మండల శివార్లలోని కనమర్లపూడి గ్రామ సమీపంలో రాయచూరు నుంచి కాశీ యాత్రకు బయలుదేరిన ట్రావెల్ బస్సు ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న లారీను అతివేగంతో ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవరు జితేంద్ర బిసోయి క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయి ప్రాణాలు విడిచినట్లు ఎస్సై తెలిపారు. ఢీకొన్న బస్సులో ప్రయాణిస్తున్న 10 మందికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అత్యవసర వాహనంలో వినుకొండ ప్రభుత్వ వైద్యశాల తరలించారు. బస్సులో ఇరుక్కుపోయిన ప్రయాణికుల కేకలు, అరుపులు అర్తనాదాలు చేస్తుండగా స్థానికులు అద్దాలు పగలకొట్టి బయటకు తీశారు. లారీ క్యాబిన్‌లో మృతి చెందిన డ్రైవరును అతికష్టం మీద బయటకు తీసి వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు, ఎస్సైలు లేళ్ల లోకేశ్వరరావు, యంవీ కృష్ణారావులు స్థానికుల సహకారంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీని క్రేన్ ద్వారా తొలిగించారు.

పెను ప్రమాదం తప్పిందని బస్సులోని ప్రయాణికులు స్థానికులు ఊపిరి పిల్చుకున్నారు. లారీ క్లీనర్ గోపాల్ బిసాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ప్రమాదంలో బస్సు, లారీ ముందుభాగం పూర్తిస్థాయిలో ధ్వంసమయ్యాయి.

నర్సరీ యజమానులు నిబంధనలు పాటించాలి



ఉప్పలపాడులో నారును పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఐ.వెంకట్రావు

నరసరావుపేటరూరల్: నర్సరీ యజమానులు నర్సరీ చట్టం ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, నిబంధనల ప్రకారమే పెంపకం చేపట్టాలని జిల్లా ఉద్యానవనశాఖాధికారి ఐ.వెంకట్రావు చెప్పారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో జిల్లా ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో షెడ్ నెట్ నిర్వాహకులకు మిరప నారు పెంపకం పై యాజమాన్య పద్ధతులు గురించి అవగాహన, శిక్షణా కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా లాంఫామ్ ప్రధానశాస్త్రవేత్త డా.సి.వెంకటరమణ పాల్గొని మిరప నారుమళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. విత్తనశుద్ధి, నారుమడిలో పాటించవలసిన సస్యరక్షణ చర్యలు, విత్తే సమయం గురించి అవగాహన కల్పించారు.

జిల్లా ఉద్యానవనశాఖాధికారి ఐ.వెంకట్రావు 2010 నర్సరీ చట్టం గురించి అవగాహన కల్పించారు. నర్సరీ చట్టం అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకం కింద ఖరీఫ్ 2025–26లో మిరపపంట ఇన్సూరెన్స్ గురించి తెలిపారు. ఎకరానికి రూ.360లు ప్రీమియం చెల్లించినచో రూ.90,000 వరకు కవరేజ్ వర్తిస్తుందని చెప్పారు. ఈ నెల 31వ తేదీలోపు ప్రతిరైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ పథకాల రాయితీల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారులు షేక్ నబీరసూల్ (నరసరావుపేట), ఆర్.శ్రీలక్ష్మీ (చిలకలూరిపేట), వై.మోహన్ (గురజాల), ఉద్యానవనశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నాతాని, అధ్యాపకులు

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రకటించిన ద్వితీయ సంవత్సరం డిగ్రీ నాల్గవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు వర్సిటీ స్థాయిలో ప్రతిభ చాటినట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. తమ విద్యార్థులు బీఎస్సీ విభాగం బాటనీలో 950 మార్కులకు గాను ఎం.ప్రశాంత్ 928, వై.వెంకటనాగలక్ష్మీ 928, కంప్యూటర్స్‌లో ఈ.దీపికారెడ్డి 888, జువాలజీలో పి.భాగ్యలక్ష్మి 871, ఏ.ఐలో షేక్.మీరా 871, డీఓలో పి.నాగేశ్వరి 838, బీసీఏలో షేక్.ఇస్రాత్ 898 మార్కులు సాధించినట్టు వివరించారు. అలాగే గణితంలో వీవీఎస్ మల్లేశ్వరి 800 మార్కులకు గాను 737 మార్కులు సాధించింది. బీకాం కంప్యూటర్స్‌లో కె.శ్రీనాథ్ 850 మార్కులకు గాను 795 మార్కులు సాధించినట్టు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపల్ నాతాని, అకడమిక్ డైరెక్టర్ డి.యోగేశ్వరరావు, కంప్యూటర్ విభాగాధిపతి టి.సురేఖ, టీపీఓ ఎం.బాలకోటేశ్వరరావు అభినందించారు.

వైద్యసేవలు పారదర్శకంగా అందించాలి

జిల్లా ఫ్యామిలీ వైద్యాధికారి డాక్టర్ హనుమ కుమార్



ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఫ్యామిలీ వైద్యాధికారి డాక్టర్ హనుమ కుమార్

శావల్యాపురం: గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని జిల్లా ఫ్యామిలీ వైద్యాధికారి డాక్టర్ హనుమకుమార్ అన్నారు. గురువారం మండలంలోని కనమర్లపూడి గ్రామంలో ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు చిన్నారుల సమగ్ర వివరాలు ఆన్‌లైన్‌లో సకాలంలో నమోదు చేయాలన్నారు. అలాగే వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వేచేసి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి వైద్యసేవలు అందించాలన్నారు. ప్రజల ఆరోగ్య విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆయనతో పాటు వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్, ఆరోగ్య కార్యకర్త దాసరి రాజ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ పృద్వీరాణి, ఆశలు ఉన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు'

యడ్లపాడు: సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రాన్ని దేశంలో ప్రథమస్థానంలో నిలిపిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గురువారం గుత్తావారిపాలెం, కారుచోల గ్రామాల్లో జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీసీరోడ్డు, గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



అత్తలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డెంగీ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అమరావతి: మండల పరిధిలోని అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగీ మాసోత్సవంలో భాగంగా గురువారం డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కార్యక్రమంతో పాటు ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కవిత, పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కవిత మాట్లాడుతూ జూలై మాసం మొత్తం జాతీయ డెంగీ మాసోత్సవం నిర్వహిస్తామని అందులో భాగంగా సచివాలయాల వారీగా దోమలు పుట్టకుండా కుట్టకుండా జాగ్రత్తలపై ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ప్రజలందరూ ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించాలని, ఇంటి ముందు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే దగ్గరలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రానికి వెళ్లి ఉచితంగా రక్త పరీక్షలు చేయించుకొని, మందులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి సబ్ యూనిట్ అధికారి సుభాన్ బేగ్, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు

అమరావతి: మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామంలో యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని పల్నాడు జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా కార్యదర్శి గోగినేని వెంకటరమణ అన్నారు. గురువారం ఆయన గ్రావెల్ అక్రమ తవ్వకాలపై మాట్లాడుతూ గ్రావెల్ మైనింగ్ మాఫియా గత కొంత కాలంగా ఎండ్రాయి గ్రామ పరిధిలోని అసైన్డ్ భూముల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్‌ను రాత్రి పగలు తేడా లేకుండా వందల భారీ లారీలతో తరలిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారన్నారు. ఈ విషయంపై గ్రామ వీఆర్‌వో, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా, ఫొటోలు పంపినా, మైనింగ్ జరిగేటప్పుడు సమాచారం ఇచ్చినా పట్టించుకోవటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు మొద్దు నిద్ర వీడి గ్రావెల్ అక్రమ తవ్వకాలను నిలువరించాలని లేకుంటే ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

స్థూపం కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



చిలకలూరిపేట: పుచ్చలపల్లి సుందరయ్య స్మారక స్థూపాన్ని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు కోరారు. పట్టణంలోని తూర్పుమాలపల్లె రోడ్డులో ఉన్న స్థూపం వెనుక ఇంటిని కొనుగోలు చేసిన వ్యక్తి పాత ఇంటిని గురువారం పడవేస్తున్నానని చెప్పి పనిలో పనిగా స్థూపాన్ని కూడా జేసీబీతో పడవేయడం అన్యాయమన్నారు. 1950 నుంచి ఇక్కడ పిల్లి అంకమ్మ చౌక్ పేరుతో వర్ధంతులు, క్రీడలు, సభలు జరుపుకుంటున్నామని, ఈ చౌక్‌లోనే సుందరయ్య వర్ధంతి సందర్భంగా స్థూపం ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఇంటిని పడవేస్తున్నప్పుడే స్థానిక వార్డు పార్టీ కార్యదర్శి సాతులూరి లూథర్ స్థూపానికి ఎలాంటి నష్టం చేయరాదని తెలిపినప్పుడు కేవలం ఇల్లు మాత్రమే పడవేస్తానని చెప్పి, స్థూపాన్ని కూడా కూల్చివేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపట్టక తప్పదని హెచ్చరించారు.

అనుమతుల్లేని మెటల్ క్వారీయింగ్‌పై సర్వే



యడ్లపాడు: కొండక్వారీల్లో ఉమ్మడిశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సర్వే ప్రక్రియ రెండోరోజు కొనసాగాయి. గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన ఫిర్యాదుతో కలెక్టర్ ఆదేశాల మేరకు వంకాయలపాడు రెవెన్యూ సర్వేనంబర్ 240/10లో ప్రారంభమైన ఈ విచారణ తొలిరోజు అనుమతులు కలిగిన నాలుగు క్వారీలను విస్తరణ, అనుమతులు పొందిన, పరిమిత కాలం, మెటల్ క్వారీయింగ్ చేసిన లోతు తదితర అంశాలపై సర్వే చేశారు. శుక్రవారం ఇదే కొండల్లో అనుమతులు లేని క్వారీయింగ్ చేస్తున్న వాటిని సర్వే చేపట్టినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం రాజేశ్వరీకి చెందిన రెండు, శివశంకర్‌కు చెందిన క్వారీలలో సంబంధించిన మూడు క్వారీల్లో కొలతలు చేసినట్లు తహసీల్దార్ జెట్టి విజయశ్రీ తెలిపారు. సర్వే విచారణలో మైనింగ్‌శాఖ నుంచి టీఏ కుమారి, సర్వేయరు రవితేజ, రెవెన్యూ ఆర్‌ఐ సుబ్బారావు, సర్వేయరు గేరా సురేంద్రనాథ్, వీఆర్వో శివకోటేశ్వరరావు, గ్రామ సర్వేయరు పవన్, పంచాయతీ కార్యదర్శి బాపిరాజు, కానిస్టేబుల్, ఫిర్యాదు దారుడు గుంజి శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు బీమా అమలు చేయాలి

కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాధాకృష్ణ డిమాండ్



నరసరావుపేట: రాష్ట్రంలో సాగుదారులలో 70 శాతం పైగా కౌలు రైతులే సాగుచేస్తున్నారని, వారందరికీ ఉచిత పంటల బీమా పథకం అమలు చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ అన్నారు. గురువారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాధాకృష్ణ మాట్లాడారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో ఆహార పంటలకు రెండు శాతం, వాణిజ్య పంటలకు ఐదు శాతం ప్రీమియం రైతులు చెల్లించాల్సి ఉండగా, బీమా కంపెనీకి చెల్లించాల్సిన మొత్తం ప్రీమియంలో మూడు శాతం ప్రీమియం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం చెల్లిస్తున్నాయన్నారు. పంటలు సాగు చేయని భూ యజమానులు పంట రుణాలను పొందుతున్నారన్నారు. పంట నష్టాలతో వారికి ప్రమేయం లేనందున పంటల బీమా చేయడానికి, ప్రీమియం చెల్లించడానికి ఇష్టపడటం లేదన్నారు. కొద్ది మంది చెల్లించినా బీమా పరిహారం వాస్తవ సాగుదారులకు కాకుండా సాగు చేయని భూ యజమానులకే అందుతుందన్నారు. పెట్టుబడులు సాగుచేపట్టిన కౌలు రైతులు ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతింటే పూర్తిగా నష్టపోతున్నారన్నారు. పరిహారం వాస్తవ సాగుదారులకు అందాలంటే కౌలు రైతుల బీమా ప్రీమియం భారం కాకుండా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి ఉచిత పంటల బీమా అమలు చేసి కౌలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఫసల్ బీమా యోజనలో వాతావరణ ఆధారిత బీమా ప్రీమియాన్ని జులై 15, దిగుబడి ఆధారిత పంటలకు జులై 31లోపు రిజిస్ట్రేషన్ చేయించాలని విధించిన గడువు పెంచాలన్నారు.

రాష్ట్రంలో ప్రధానంగా పల్నాడు జిల్లాలో ఆగస్టు, సెప్టెంబర్ నెలలో సాగుకు సిద్ధమవుతారని, ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 15 వరకు బీమా నమోదు గడువు పెంచాలని కోరారు. అదేవిధంగా రబీ పంటలకు నవంబర్ నుంచి ఫిబ్రవరిలోగా పంటల బీమా చేయించాలన్నారు. కౌలు రైతులను ఈ క్రాప్‌లో నమోదు చేయాలని, నమోదైన భూమిలేని కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు కౌలు రైతులకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట సాగు హక్కు పత్రాలు పొందిన కౌలు రైతులకు ఎటువంటి హామీ లేకుండా రూ.2 లక్షల వరకు పంట స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకులు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో మాదిరి రూ.1 లక్షకు సున్నా వడ్డీ, మరో లక్షకు పావలా వడ్డీ రుణాలు మంజూరు చేయాలని కోరారు.

సహకార సంఘాల బలోపేతంతో రైతులకు మేలు

జిల్లా సహకార సంఘ అధికారి ఎం.నాగరాజు



మాట్లాడుతున్న నాగరాజు

నాదెండ్ల: సహకార సంఘాలు బలోపేతంగా ఉంటేనే రైతులు ఆర్థికంగా ఎదగగలుగుతారని జిల్లా సహకార సంఘ అధికారి ఎం.నాగరాజు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో గురువారం అంతర్జాతీయ సహకార వారోత్సవాల్లో భాగంగా రైతులకు రుణాల మంజూరుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రైతులకు రుణాల మంజూరులో సహకార సంఘాలు ప్రథమ స్థానంలో ఉన్నాయని, రైతు అభివృద్ధి లక్ష్యంగా సహకార సంఘాలు పని చేస్తున్నాయన్నారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించటం ద్వారా పరపతి సంఘాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

రైతులు మిగుల్చుకున్న నగదును డిపాజిట్ చేసి అధిక వడ్డీ పొందవచ్చని సూచించారు. వాణిజ్య బ్యాంకుల మాదిరిగా అన్ని రకాల రుణాలను తక్కువ వడ్డీకే అందిస్తున్నట్లు చెప్పారు. డివిజనల్ రిజిస్ట్రార్ కె.తిరుపతయ్య మాట్లాడుతూ సహకార సంఘాల్లో అక్రమాలు చోటు చేసుకోకుండా కంప్యూటరీకరణ జరిగిందన్నారు. మోడల్ ఆడిట్ ద్వారా సంఘాలను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. సంఘాల అభివృద్ధికి రైతులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సబ్ డివిజనల్ రిజిస్ట్రార్ ఎస్ చినరామిరెడ్డి, పీఏసీహెచ్ స్వరూప, గణపవరం, నాదెండ్ల సీఈవోలు లక్ష్మయ్య, ధనలక్ష్మీ, నాయకులు నల్లమోతు హరిబాబు ఉన్నారు.

బైపాస్ వంతెన వద్ద పోలీసుల స్పెషల్ డ్రైవ్

నిర్లక్ష్య డ్రైవింగ్‌కు మూడు కేసులు నమోదు



వాహనాదారుల్ని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న పోలీసులు

యడ్లపాడు: మండలంలోని తిమ్మాపురం కొత్త బైపాస్ రహదారి వంతెన వద్ద పోలీసులు నిర్వహించిన ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తున్న ముగ్గురు వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారిపై ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు వెల్లడించారు. తనిఖీల్లో భాగంగా అతివేగంగా ద్విచక్ర వాహనం నడిపిన ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న రెండు ఆటోలపై కూడా పోలీసులు కేసులు నమోదు చేసి ఈ మూడు వాహనాలకు ఒక్కొక్క దానికి రూ. 2 వేల చొప్పున అపరాధ రుసుము విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ టి.శివరామకృష్ణ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇచ్చినా, రోడ్లపై రాష్ డ్రైవింగ్ చేసినా లేదా ప్యాసింజర్ ఆటోలలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

నాదెండ్ల: చిరుమామిళ్లలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురు జూదరులను అరెస్టు చేసి రూ.8 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద రూ.8 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను చిలకలూరిపేట న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికీ రూ.300 లు జరిమానా విధించినట్లు తెలిపారు.

మహిళా ఉద్యోగిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కొండలరావు

సత్తెనపల్లి: సర్వేలో భాగంగా ఇంటి కొలతలు తీసుకుంటున్న విజయవాడ గవర్నర్‌పేట 98వ సచివాలయ అడ్మిన్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న లక్కావజ్జుల అర్చనపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు బిట్రా కొండలరావు డిమండ్ చేశారు. ఈ దాడిని ఖండిస్తూ సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ నిరసనలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఒక మహిళా ఉద్యోగిపై దాడి చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించటంతో పాటు ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధితురాలు అర్చనకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ సత్తెనపల్లి శాఖ అధ్యక్షుడు సీహెచ్ ప్రదీప్, కమిటీ సభ్యులు వై.వంశీ సాయి, ఆర్.గౌరీశంకర్, ఎం.సరిత, షేక్ సైదా, సందెపోగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com